సొరంగంలో మరణమృదంగం

ఎస్ఎల్‌బీసీ సొరంగం



సొరంగం లోపల టీబీఎం యంత్రాన్ని తొలగిస్తున్న రెస్క్యూ బృంద సభ్యులు

ఎస్ఎల్‌బీసీ ఒడవని కథ..

- తెలంగాణ పాలిట కాంగ్రెస్ తగిలించిన గుదిబండ
- ప్రాజెక్టు రూపకల్పనలోనే సీమాంధ్ర పాలకుల కుట్ర

తెలంగాణకు తీరని వ్యథ..

తెలంగాణకు నీళ్లివ్వకుండా నీరుగార్చే కుటిల యత్నం • చర్చలు, అనుమతుల పేరిట ఎండ్ల తరబడి సాగదీత

షాఫ్ట్ లేకుండానే సొరంగం తవ్వకం పనులు ప్రారంభం • 50 డెసిబుల్స్ శబ్దం దాటవద్దని వైల్డ్‌లైఫ్ ఆంక్షలు

- సంక్లిష్టమైన టీబీఎం టెక్నాలజీతో పనులు మొదలు
- దశాబ్దాలు గడిచినా ముందుకు పోదు.. వెనక్కి రాదు
- కాంట్రాక్టు రద్దు చేస్తే భారీ పరిహారం చెల్లించాల్సిందే
- ఇది తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ చేసిన అతిపెద్ద పాపం
- నాడు ఉద్యమనేతగా తీవ్రంగా నిప్పులు చెరిగిన కేసీఆర్

> తెలంగాణకు నీళ్లు పారడమా? గ్రావిటీ ద్వారానా?.. అదీ శ్రీశైలం ద్వారానా? ఇంకేమైనా ఉన్నదా? తెలంగాణ పచ్చబడి పోదూ! సీమకు నీళ్లు కరువైపోవూ! ఇవ్వడానికి మనసొప్పదు.. ఇవ్వకుంటే తెలంగాణ సమాజం ఒప్పుకోదు. మరేం చేయాలి? ఇచ్చినట్టే ఉండాలి! కానీ ఇచ్చిన ఫలితం దక్కకూడదు! అలాంటి కుట్రల మధ్య పుట్టిందే శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ)!. చర్చల పేరిట సాగదీత.. సర్వేల పేరిట కాలయాపన.. అనుమతులు రావని తెలిసిన చోటునే ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు! వేగంగా పూర్తికాకుండా షరతులు.. నిర్మాణానికి నిధులివ్వరు. పట్టాలెక్కడం ఒక వంతయితే.. ఆ ప్రాజెక్టు నిర్మాణం ముందుకు పోకుండా అవరోధాలు కల్పించడం.. నిర్మాణం కొనసాగకుండా నిర్వీర్యం చేయడం, నీళ్లు రాకుండా అడ్డుకోవడం మరోవంతు! ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత ప్రాజెక్టుల నిర్మాణ దైన్యానికి నిలువెత్తు సజీవ సాక్ష్యమిది!. అదొక అంతులేని కథ! కాంగ్రెస్ పాలకులు తగిలించిన గుదిబండతో ఇప్పటికీ తెలంగాణకు తీరని వ్యథ!
> - మ్యాకం రవికుమార్

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం రిజర్వాయర్ 825 అడుగుల నుంచి గ్రావిటీ ద్వారా కృష్ణా జలాలను తరలించేందుకు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ)ను రూపొందించారు. తద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించే లక్ష్యంతో నిర్దేశించారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 43.50 కిలోమీటర్ల మొదటి సొరంగ మార్గం ద్వారా డిండి నది వద్ద నిర్మించే రిజర్వాయర్‌లో (నక్కలగండి తండా) కలుపుతారు. అక్కడి నుంచి 7.21 కిలోమీటర్ల రెండో సొరంగం ద్వారా నేరడిగొమ్మ వరకు, ఆపై 3.2 కిలోమీటర్ల ఓపెన్ చానల్ ద్వారా పెండ్లిపాకల రిజర్వాయర్‌కు తరలిస్తారు. గుర్రంపోడు, కనగల్లు మండలాల మీదుగా ఉదయసముద్రం రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి అయిటిపాముల ట్యాంక్ మీదుగా మూసీలో కలుస్తుంది. ఇదీ ఎస్ఎల్‌బీసీ హైలెవల్ కెనాల్ వెళ్లే మార్గం. కానీ 1995 వరకు ఎస్ఎల్‌బీసీ పనులు పట్టాలెక్కలేదు. అటు తర్వాత తెలంగాణ మలిదశ ఉద్యమం ఊపందుకోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సొరంగ పథకాన్ని యథావిధిగా కొనసాగిస్తూనే నాగార్జునసాగర్ ఫోర్‌షోర్ నుంచి నీటిని లిఫ్ట్ చేసి ఎస్ఎల్‌బీసీ హైలెవల్ కెనాల్‌కు, హైదరాబాద్‌కు తాగునీటిని అందించాలని నిర్ణయించారు. అందులో భాగంగా సాగర్ నుంచి జలాలను పుట్టంగండి పంపింగ్ స్టేషన్ ద్వారా అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు కలుపుతారు. అక్కడి నుంచి జలాలను ఎస్ఎల్‌బీసీలో భాగంగా నిర్మించిన హైలెవల్ కెనాల్‌కు 25వ కిలోమీటర్ వద్ద కలుపుతారు. అయితే ఎస్ఎల్‌బీసీ గ్రావిటీ ద్వారా 4 వేల క్యూసెక్కులు రానుండగా, లిఫ్ట్ ద్వారా ప్రస్తుతం కేవలం 2400 క్యూసెక్కులనే తరలిస్తున్నారు. తదనంతరం ప్రాజెక్టు మొత్తానికి ఎస్ఎల్‌బీసీ ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుగా నామకరణం చేశారు.

ప్రహసనంలా ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పనులు

టన్నెల్ అనుమతులు ఆలస్యమవడం, తెలంగాణ సమాజం నుంచి ఒత్తిడి పెరగడంతో ఎట్టకేలకు లిఫ్ట్ పనులను మొదలుపెట్టాలని నిర్ణయించారు. 1983 నుంచి 1989 వరకు టీడీపీ హయాంలో కాలువ పనులు సాగాయి. 1989లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ సొరంగం స్కీమ్‌ను తెరపైకి తెచ్చింది. సొరంగం పూర్తయ్యే వరకు పనులను నిలిపేయాలని ఆదేశించింది. అయిదేళ్ల పాటు కాలయాపన చేసిన ప్రభుత్వం మళ్లీ 1994లో కేంద్రం నుంచి అటవీ, పర్యావరణ అనుమతులు తీసుకొచ్చింది. ఆ తర్వాత డీపీఆర్ తయారీ సమయంలో కాంగ్రెస్ పోయి టీడీపీ రాగానే మళ్లీ సొరంగం స్కీమ్‌ను పక్కనపెట్టింది. నాగార్జునసాగర్ నుంచి లిఫ్ట్ పనులనే పునఃప్రారంభించింది. 2004లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చాక సొరంగం పనులకే మొగ్గుచూపింది. 2005లో టన్నెల్ పనులను ప్రారంభించింది. రెండు వైపుల నుంచి పనులు ప్రారంభించింది. నిధులు విడుదల చేయకపోవడంతో దశాబ్దాలు గడచినా పూర్తి కాలేదు. ఇప్పటి వరకు 34.372 కిలో మీటర్ల సొరంగం తవ్వకం పూర్తికాగా, ఇంకా 9.560 కిలో మీటర్ల మేర తవ్వాల్సి ఉన్నది.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపలి దృశ్యం

ప్రాజెక్టు నిర్వీర్యానికి అనేక కుట్రలు

ప్రాజెక్టును నీరుగార్చేందుకు సీమాంధ్ర పాలకులు చేసిన కుట్రలు అన్నీఇన్నీ కావు. అయినా ప్రాజెక్టుపై నల్లగొండ రైతాంగం పట్టు వీడలేదు. 1996 ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంట్ నుంచి 450 మందికి పైగా నామినేషన్లు వేశారంటే అర్థం చేసుకోవచ్చు. అక్కడికీ సీమాంధ్ర పాలకులు కుట్రలను ఆపలేదు. 2003లో స్ప్రింక్లర్ ప్రాజెక్టుగా ప్రకటించి కోట్ల రూపాయాలు వెచ్చించి ఆస్ట్రేలియా దేశం నుంచి సామగ్రి తెప్పించారు. వాటి నిర్వహణకే ఏడాదికి రూ.10 లక్షల వ్యయం అవుతున్నది. ఏడాది తిరక్కుండానే ప్రాజెక్టు నిర్వహణ భారాన్ని రైతులపైన వేయడంతో ఈ పథకం అటకెక్కింది. 2005లో మళ్లీ ఓసారి స్ప్రింక్లర్ విధానం వద్ద కన్వెన్షనల్ స్ప్రింక్లర్స్ పేరుతో మరో కుట్రకు తెరతీశారు. కరెంట్ సరఫరా లేకపోవడంతో ఇది భ్రష్టుపట్టింది. ఈ కుట్రలన్నింటినీ నాడు ఉద్యమనేత కేసీఆర్ పటాపంచలు చేశారు. ఆంధ్రాకు గ్రావిటీ ఏంది? తెలంగాణకు స్ప్రింక్లర్లు ఏంది? తెలంగాణను నాశనం చేయడానికా? అని గర్జించారు.

అడుగు పెట్టవద్దు.. సౌండ్ 50 డెసిబుల్స్ దాటవద్దు

ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులో శ్రీశైలం నుంచి డిండి రిజర్వాయర్ వరకు 43.50 కిలోమీటర్ల టన్నెల్ తవ్వాల్సి ఉన్నది. టన్నెల్ అలైన్‌మెంట్ మొత్తం కూడా అభయారణ్యం నుంచే ఉన్నది. దీంతో కేంద్రం అనుమతులిచ్చేందుకు దశాబ్దకాలం పట్టింది. ఎట్టకేలకు 1994లో ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గానికి కేంద్రం ఇచ్చింది. అయితే అనేక కఠిన షరతులను విధించింది. అభయారణ్యంలోకి అడుగు కూడా పెట్టవద్దని తేల్చిచెప్పింది. కేవలం భూమి కింద నుంచి సొరంగం తవ్వుకోవాలని షరతు విధించింది. వఅఖరికి సొరంగం తవ్వడానికి ముందు అధ్యయనం చేయడానికి హెలికాప్టర్‌ను వినియోగిస్తే దాని శబ్దం 50 డెసిబుల్స్ దాటకూడదని నిబంధనలు విధించింది. అంటే వ్యాక్యూమ్ క్లీనర్ నుంచి ఎంత శబ్దం వస్తుందో అంతకు మించి రాకూడదు. జియోలాజికల్ సర్వేకు అభయారణ్యంలో బోర్ హోల్స్‌కు అనుమతి లేదు. ఇలాంటి అనేక షరతులతో పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ అనుమతులు మంజూరు చేసింది.

కాంగ్రెస్ తగిలించిన గుదిబండ

ప్రాజెక్టు సుదీర్ఘకాలం పాటు ముందుకుపోకుండా ఉండేందుకు ప్రధాన కారణం అభయారణ్యం గుండా టన్నెల్‌ను ప్రతిపాదించడమే! ఆపై సొరంగం తవ్వకానికి ఎంచుకున్న టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషీన్) టెక్నాలజీనే! సుదీర్ఘమైన సొరంగాలను తవ్వేందుకు సాధారణంగా డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ టెక్నాలజీని వినియోగిస్తారు. చిన్నచిన్న భాగాలుగా విభజించుకొని ఆడిట్ పాయింట్లు (గాలి, వెలుతురు వచ్చేందుకు, తవ్వకంలో వచ్చే మట్టి, రాళ్లను తరలించేందుకు మార్గాలు) ఏర్పాటు చేసుకుని సొరంగం తవ్వకాన్ని పూర్తిచేస్తారు. కానీ ఎస్ఎల్‌బీసీ టన్నెల్ అభయారణ్యంలో ఉండడంతో ఆడిట్‌పాయింట్లకు అవకాశం లేకుండాపోయింది. మరోవైపు వన్యప్రాణులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు భూప్రకంపనలు, శబ్దాలు రాకుండా ఉండేందుకు దాదాపు భూఉపరితలం నుంచి 450 మీటర్ల దిగువ నుంచి సొరంగాన్ని తవ్వాలని నిర్ణయించారు. అదీగాక నీటి ఊట కూడా ప్రధాన సమస్య. నిరంతరాయంగా డీవాటరింగ్ ప్రక్రియ కొనసాగాల్సిందే! పొడవైన, లోతైన టన్నెల్ కావడంతో 2-3 గంటల పనిచేస్తే అలసిపోయే పరిస్థితి ఉంటుంది. కాంగ్రెస్ పనులు కట్టబెట్టిన కాంట్రాక్టు సంస్థ కూడా పనుల జాప్యానికి కారణం. పనులను దక్కించుకున్న సదరు ఏజెన్సీ అమెరికాకు చెందిన రాబిన్సన్ కంపెనీకి సొరంగం తవ్వకం పనులను సబ్‌కాంట్రాక్టు ఇచ్చింది. ఆ కంపెనీయే టీబీఎంను సప్లయ్ చేసింది. మిషన్ పరికరాలు మరమ్మతులకు గురైతే అక్కడి నుంచే నిపుణులు, మిషన్ స్పేర్ పార్ట్స్ రావాల్సిందే! అందుకు నెలల తరబడి సమయం పడుతుంది.

ముందుకు పోదు.. వెనక్కి రాదు..

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోని టీబీఎం గరిష్ఠ సామర్థ్యం గంటకు 2.5 మీటర్లు. కానీ ప్రస్తుతం అది 24 గంటల్లో గరిష్ఠంగా 6 మీటర్లకు మించి తవ్వకాన్ని పూర్తి చేయడం లేదంటే అక్కడి అసాధారణ పరిస్థితులను అంచనా వేయవచ్చు. దీన్ని ఇప్పుడు తొలగించి అధునాతన టెక్నాలజీని వినియోగించి తవ్వుదామన్నా అదీ కుదరని దుస్థితి. కారణం ప్రస్తుతం టీబీఎం బోరింగ్ మెషీన్ వ్యాసార్థం (డయా) 10 మీటర్లు. ఆ వ్యాసార్థంతో రాతి పొరలను తొలుస్తూ ముందుకు వెళ్తుంది. సొరంగం కూలిపోకుండా సిమెంట్ సెగ్మెంట్లను అమర్చడం వల్ల ఫినిషింగ్ డయా 9.2 మాత్రమే ఉంటుంది. దీంతో 10 మీటర్ల డయా కలిగిన టీబీఎం బయటకు రాలేదు. అంటే కేవలం ముందుకు మాత్రమే వెళ్లగలుతుంది. వెనక్కి తీసే అవకాశమే లేదు. సొరంగం తవ్వకం పూర్తయ్యాక అక్కడే ఒక పక్కగా తవ్వి టీబీఎంను అందులోనే పూడ్చిపెడతారు. అదీగాక ఈపీసీ విధానంలో కాంట్రాక్టు రద్దు చాలా వరకు అసాధ్యం. ఒక వేళ చేసినా ఏజెన్సీకి కోట్లాది రూపాయలను పరిహారంగా చెల్లించాల్సి ఉంటుంది. కాంగ్రెస్ సర్కారు ఎంచుకున్న ప్రాంతం.. టెక్నాలజీ.. విధించిన నిబంధనలే ప్రాజెక్టు పనులకు గుదిబండగా మారాయి.

ప్రాజెక్టు పట్టాలెక్కిన తీరిది!

- 1969లో ఉమ్మడి ఏపీ ప్రతిపాదన
- 1979 ఆగస్టులో జీవో 315 విడుదల
- 1981లో డీపీఆర్ తయారీ జీవో 342 విడుదల
- 1982లో 30 టీఎంసీలు కేటాయిస్తూ జీవో 306 విడుదల
- 1985లో సీడబ్ల్యూసీకి డీపీఆర్ అందజేత
- 1986లో డీపీఆర్ తిరస్కరణ
- 1994లో పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ అనుమతులు
- 2005లో సొరంగం పనులు ప్రారంభం

ఎలిమినేటి మాధవరెడ్డి - శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టు స్వరూపం ఇదీ!

- **ప్రాజెక్టు లక్ష్యం:** నల్లగొండకు సాగునీరు, ఫ్లోరైడ్ ప్రాంతాలకు తాగునీరు
- **ప్రాజెక్టు సామర్థ్యం:** 30 టీఎంసీలు (కృష్ణా జలాలు)
- **సాగునీరు:** 27.35 టీఎంసీలు
- **తాగునీరు:** 2.65 టీఎంసీలు
- **ఆయకట్టు:** 3 లక్షల ఎకరాలు
- **లబ్ధిపొందనున్నవి:** 8 మండలాలు, 108 గ్రామాలు
- **తాగునీరు అందుతున్న గ్రామాలు:** 516
- **గ్రావిటీ స్కీమ్:** శ్రీశైలం రిజర్వాయర్ నీటి నిల్వ (ఫోర్‌షోర్) నుంచి రెండు టన్నెళ్ల ద్వారా నీటి తరలింపు (సొరంగం తవ్వకం పూర్తికావాల్సి ఉన్నది)
- **లిఫ్ట్ స్కీమ్:** నాగార్జునసాగర్ నీటి నిల్వ (ఫోర్‌షోర్)నుంచి పుట్టంగండి పంప్‌హౌస్ ద్వారా నీటి ఎత్తిపోత

అసెంబ్లీ వేదికగా సవాళ్లను వివరించిన కేసీఆర్

ఎస్ఎల్‌బీసీ సొరంగం తవ్వకంలో ఎదురయ్యే సవాళ్లను, టెక్నాలజీ పనితీరును అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ వివరించారు. ప్రాజెక్టు పరిస్థితులను గూగుల్ మ్యాపు ఆధారంగా తెలియజేశారు. పనుల పురోగతిలో సంక్లిష్టతను తెలిపి వాపోయారు. తదనంతరం ప్రాజెక్టు ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని పనులను ముందుకు తీసుకెళ్లారు. టీబీఎం సొరంగాన్ని తవ్వే సామర్థ్యం పూర్తిగా తగ్గిపోవడం, సొరంగం పొడవు పెరిగిన కొద్దీ కార్మికులు పనిచేసే సామర్థ్యం తగ్గిపోవడం, సీపేజీ ఎక్కువ రావడం సవాలుగా నిలిచింది. సాంకేతిక సవాళ్లను అధిగమించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టారు. డీవాటరింగ్ సిస్టమ్‌ను మెరుగుపరచి డిసెంబర్ 2019 వరకు నీటిని తొలగించారు. కాంట్రాక్టు ఏజెన్సీకి అప్పటివరకు చెల్లిస్తున్న డీవాటరింగ్ చార్జీలను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే సవరించి పెంచింది. కాంట్రాక్టు సంస్థ కరెంటు బిల్లులను సక్రమంగా చెల్లించకపోవడం, టీఎస్ఎస్‌పీడీసీఎల్ విద్యుత్తు సరఫరాను నిలిపివేయడం, ఫలితంగా డీవాటరింగ్ నిలిచి టీబీఎం పాక్షికంగా మునిగి పనులు నిలిచిపోవడం పరిపాటిగా మారింది. విషయాన్ని తెలుసుకొని ఆ కరెంటు బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తుందని, ఆ బిల్లును ఏజెన్సీకి చెల్లించే బిల్లుల నుంచి మినహాయించుకుంటుందని, కరెంటు సరఫరాను ఎట్టి పరిస్థితుల్లోనూ కట్ చేయవద్దని టీఎస్ఎస్‌పీడీసీఎల్‌కు కేసీఆర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీన్ని క్యాబినెట్‌లో పెట్టి ఆమోదం తీసుకున్నారు. ఇది రాష్ట్ర ప్రాజెక్టుల చరిత్రలోనే తొలిసారి కావడం గమనార్హం. అయితే ప్రస్తుతం సొరంగం తవ్వుతున్న ప్రాంతంలో షియర్ జోన్ నుంచి భారీ సీపేజీ రావడాన్ని గుర్తించి నివారణ చర్యలు చేపట్టేవరకూ పనులు నిర్వహించవద్దని నిర్ణయించారు. సాంకేతిక సమస్యలతో ప్రాజెక్టు పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొన్నది.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వివరాలు..

వర్గం	సొరంగం-1	సొరంగం-2
మొత్తం పొడవు	43.931 కి.మీ	7.25 కి.మీ
ప్రాంతం	శ్రీశైలం -బ్యాలెన్సింగ్ రిజర్వాయర్	చందంపేట మండలం తెల్దేవరపల్లి నుంచి నేరడుగొమ్ము
ప్రస్తుతం తవ్వింది	34.372 కి.మీ	పూర్తయింది. లైనింగ్ పెండింగ్‌లో ఉంది.
ఇంకా పూర్తికావాల్సింది	9.560 కి.మీ	---

తెలంగాణను ఏమార్చేందుకే!

ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు ఏర్పాటే తెలంగాణను ఏమార్చేందుకు, కృష్ణా జలాలను యథేచ్ఛగా సీమకు తరలించుకునేందుకే అంటే అతిశయోక్తేమీ కాదు. రాయలసీమకు కృష్ణాజలాలను మళ్లించేందుకు ఉమ్మడి ఏపీలో నాటి పాలకులు అనేక కుట్రలకు తెరలేపారు. చెన్నైకి సాగునీళ్లు అందించే సాకుతో శ్రీశైలం రిజర్వాయర్ గట్టుకు తొలుత గండిపెట్టారు. ఆ తర్వాత రాయలసీమలో లక్షల ఎకరాలకు సాగునీరందించే తెలుగు గంగ ప్రాజెక్టును తెరమీదికి తెచ్చారు. శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఆర్‌బీసీ) ద్వారా 19 టీఎంసీలు వినియోగించుకునేలా అనుమతులూ తెచ్చుకున్నారు. అయితే చెన్నైకి, బేసిన్ అవతల రాయలసీమకు జలాలను తరలించే ప్రణాళికపై తెలంగాణ నుంచి తీవ్ర వ్యతిరేకత పెల్లుబికింది. తెలంగాణ శాంతించాలంటే శ్రీశైలం ఎడమ వైపు (తెలంగాణ) కూడా ఏదైనా ఒక ప్రాజెక్టును ప్రకటించాలని ఎస్ఎల్‌బీసీని తెరపైకి తెచ్చారు. దీంతో 1981లో అఖిలపక్షం తీర్మానం మేరకు శ్రీశైలం రిజర్వాయర్‌కు కుడి వైపునే కాకుండా, ఎడమ వైపున కూడా కాలువలు తవ్వాలని నిర్ణయించారు. కుడివైపు అంటే ఏపీ వైపున రిజర్వాయర్ గట్టుపై 854 ఫీట్ల వద్ద పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీని నిర్మించి, అక్కడి నుంచి బనకచర్లకు మళ్లించి, ఆపై మూడు కాలువల ద్వారా తెలుగుగంగ, శ్రీశైలం కుడికాలువ (ఎస్ఆర్‌బీసీ), నిప్పుల వాగు ఎస్కేప్ చానల్‌కు ప్రణాళికలను సిద్ధం చేశారు. శ్రీశైలం ఎడమగట్టు వైపు అంటే తెలంగాణ వైపు 854 ఫీట్ల వద్ద సొరంగం తవ్వి తద్వారా నల్లగొండ జిల్లాకు సాగు, తాగునీరందించాలని నిర్ణయించారు. కుడిగట్టు కాలువ (ఎస్ఆర్‌బీసీ)కి సంబంధించిన పనులన్నీ 1988 వరకే చకచకా పూర్తిచేశారు. కానీ తెలంగాణకు సంబంధించిన ఎస్ఎల్‌బీసీ సొరంగం దశాబ్దాలు గడచినా ఇప్పటికీ పూర్తికాకపోవడం విషాదకరం. ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్ర పాలకులు, కాంగ్రెస్, టీడీపీ సర్కార్లు తెలంగాణ ప్రాజెక్టులపై చూపిన వివక్షకు.. ఇప్పటికీ పూర్తికాని ఎస్ఎల్‌బీసీ సొరంగమే నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, పక్కన ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్

కాంగ్రెస్ నిర్లక్ష్యానికి కార్మికులు బలి

- ప్రభుత్వ తప్పిదంతోనే ఎస్ఎల్‌బీసీ ప్రమాదం
- సహాయక చర్యల్లో సర్కారు దారుణంగా విఫలం
- తప్పించుకునేందుకే కేసీఆర్, హరీశ్‌రావుపై నిందలు
- తీరుమార్చుకోకుంటే రేవంత్‌పై తిరుగుబాటు తప్పదు
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యానికి ఎస్ఎల్‌బీసీ ఘటనలో కార్మికులు బలయ్యారని మాజీ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. వారి మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పది రోజులైనా సహాయక చర్యలు చేపట్టడంలో విఫలమైందని మండిపడ్డారు. పదిరోజుల తర్వాత ప్రమాద స్థలికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల దృష్టి మరల్చేందుకు ఈ ఘటనతో సంబంధం లేని కేసీఆర్, హరీశ్‌రావుపై నిందలు మోపడం సిగ్గుచేటన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాను చదువుకున్న వనపర్తికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గొప్ప ప్రాజెక్టు ప్రకటిస్తారనుకున్నామని, కానీ ఆయన రోజు మాదిరిగా కేసీఆర్‌ను దుర్భాషలాడడం, ఈ ఘటనకు ఆయనదే బాధ్యత అని మాట్లాడడం దుర్మార్గమన్నారు.

బీజేపీకి స్వాగతం.. బీఆర్ఎస్‌కు అడ్డగింతా?

'ఎస్ఎల్‌బీసీ ప్రమాదస్థలానికి వెళ్లిన హరీశ్‌రావు బృందాన్ని అడ్డుకున్న ప్రభుత్వం.. బీజేపీ నేతలకు సాదరస్వాగతం పలికింది. ఈ వ్యవహారమే బీజేపీ, కాంగ్రెస్ మైత్రికి నిదర్శనం' అంటూ శ్రీనివాస్‌గౌడ్ వ్యాఖ్యానించారు. ఘటనకు ముందే దుబాయ్‌కు వెళ్లిన హరీశ్‌రావుపై అభాండాలు వేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టాలా? ప్రతిపక్షం చేపట్టాలా? అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో రూ.3900 కోట్లు వెచ్చించి టన్నెల్ తవ్వకం పనులు చేపట్టిందని గుర్తుచేశారు. కానీ, నిపుణులను సంప్రదించకుండానే ప్రభుత్వం క్లిష్టమైన సొరంగం తవ్వకం మొదలు పెట్టిందని ఆరోపించారు. ఘటన జరిగి పదిరోజులైనా కార్మికులను గుర్తించలేదని మండిపడ్డారు.

జైలుకెళ్లకుండా బీజేపీతో లాలూచీ : గువ్వల

ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయిన రేవంత్‌రెడ్డి జైలుకు వెళ్లకుండా ఉండేందుకే బీజేపీతో లాలూచీపడ్డారని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆరోపించారు. 15 నెలల్లో 37సార్లు ఢిల్లీకి వెళ్లి ఏం సాధించారని నిలదీశారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదం జరిగిన రోజే కార్మికులు మరణించినట్టు పేర్కొన్నారు. సహాయక చర్యల్లో విఫలమైన ప్రభుత్వం.. బీఆర్ఎస్ బృందాన్ని అడ్డుకోవడం విడ్డూరమన్నారు. ఇప్పటికైనా సహాయక చర్యల్లో వేగం పెంచి కార్మికులను గుర్తించాలని డిమాండ్ చేశారు.

తొలగిన టీబీఎం అడ్డంకి

- చివరిదశకు కన్వేయర్ బెల్ట్ మరమ్మతులు
- హిటాచీని లోపలికి పంపిన రెస్క్యూ టీం
- నేటి నుంచి స్పీడ్ అందుకోనున్న పనులు
- టన్నెల్ వద్ద కనిపించని ప్రభుత్వ పెద్దల హడావుడి

మహబూబ్‌నగర్, మార్చి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/అచ్చంపేట : ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు అడ్డంకిగా ఉన్న టీబీఎం(టన్నెల్ బోరింగ్ మిషన్)ను సోమవారం పూర్తిస్థాయిలో కట్ చేశారు. మిషన్ పార్ట్స్‌ను బయటికి తరలించే ఏర్పాట్లుచేస్తున్నారు. మరోవైపు కన్వేయర్ బెల్ట్ మరమ్మతులు కూడా చివరి దశకు చేరాయి. ఇప్పటివరకు లోపలికి వెళ్లేందుకు నానాఇబ్బందులు పడిన రెస్క్యూ సిబ్బందికి టీబీఎం అడ్డు తొలగిపోవడంతో లోపలికి వెళ్లేందుకు సులువుగా మారింది. అధికార యంత్రాంగం హిటాచీని లోపలికి పంపించి మిషన్ భాగాలను పక్కకు తొలగించారు. రాత్రి నుంచి బురదను కూడా హిటాచీతో తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఒకటి, రెండు రోజుల్లో సొరంగంలో చిక్కుకున్న కార్మికులను గుర్తించే అవకాశం ఉన్నది. పదిరోజుల నుంచి రెస్క్యూ సిబ్బంది మాత్రమే ఎన్నో ఇబ్బందులు పడుతూ కష్టంగా బురద తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. ఇక హిటాచీని లోపలికి పంపించడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, కార్మికుల ఆచూకీ కోసం జీపీఆర్ సర్వే గుర్తించిన స్థలాల్లో తవ్వకాలు జరిపినా.. అక్కడ ఎలాంటి ఆచూకీ లభించలేదని తెలిసింది. ఇనుప పరికరాలు మాత్రమే కనిపించినట్టు సమాచారం.

సొరంగంలో టీబీఎం యంత్రాన్ని కట్ చేస్తున్న రెస్క్యూ బృందం

వేగవంతంగా డీవాటరింగ్ ప్రక్రియ..

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌లో పాలుపంచుకుంటున్న బృందాల అధికారులతో సోమవారం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, కలెక్టర్ బాదావత్ సంతోష్, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌అలీ, ఎస్సీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఎన్డీఆర్ఎఫ్ అధికారి ప్రసన్న.. హైడ్రా, సింగరేణి మైన్స్ రెస్క్యూ, ఎన్డీఆర్ఎఫ్, ఫైర్ సర్వీసెస్, దక్షిణ మధ్య రైల్వే ప్లాస్మా కట్టర్స్, ర్యాట్ మైనర్స్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కన్వేయర్ బెల్ట్ మరమ్మతు పనులు వేగవంతం చేశామని, ప్రమాద ప్రదేశంలో ఉన్న మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. డీవాటరింగ్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతున్నదని, ప్రమాద ప్రదేశంలో జరుగుతున్న సహాయక చర్యల్లో ఎదురువుతున్న సమస్యలపై 12 సంస్థల బృందాల అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. నేటి నుంచి పనులు స్పీడ్ అందుకోనున్నట్టు తెలిపారు.

కనిపించని ప్రభుత్వ పెద్దల హడావుడి

తొమ్మిది రోజులపాటు హడావుడి చేసిన ప్రభుత్వ పెద్దలు, మీడియా ప్రతినిధులు పదోరోజు కనిపించలేదు. ప్రమాదం జరిగినప్పటి నుంచి ప్రభుత్వపరంగా మంత్రులు ఉత్తమ్, జూపల్లి, కోమటిరెడ్డి, కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, మల్లు రవి, స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ ఎవరో ఒకరు ఘటనా స్థలంలో ఉండి రెస్క్యూ బృందాల ప్రతినిధులతో సమీక్షలు జరపడం, మీడియాతో ప్రెస్‌మ